# సైనిక బలగాల సంరక్షణలో హింసాకాండ సాగిస్తున్న

# ప్రైవేట్ సాయుధ ముఠాలు

1986 నవంబర్ 7వ తేదీ తెల్లవారుజామున కరీంనగర్ జిల్లా అల్గునూరు నివాసి అయిన పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాపా లక్ష్మారెడ్డిగారిని తెల్ల అంబాసిడర్ కారులో వచ్చిన పోలీసు హంతకులు కాల్చి చంపారు. రైతాంగ ఉద్యమాలలో, కమ్యూనిస్టు పార్టీలో, చివరి రోజులలో పౌరహక్కుల ఉద్యమంలో ప్రజల హక్కుల పరిరక్షణ కోసం లక్ష్మారెడ్డిగారు అవిశ్రాంతంగా కృషి చేశారు. ఆ కృషి ఫలితమే ఆయన హత్య.

ఆయన 11వ వర్ధంతి సందర్భంగా, దేశంలో సాయుధ పోరాటాలు నడుస్తున్న ప్రాంతాలలో వాటిని ఎదుర్కొనడానికి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఒక కొత్త ఎత్తుగడ వల్ల తలెత్తుతున్న తీవ్రమైన పౌరహక్కుల సమస్యల గురించి సదస్సు నిర్వహిస్తున్నాం. ఆ ప్రాంతాల పరిస్థితులతో పరిచయం ఉన్న పౌరహక్కుల కార్యకర్తలు సదస్సులో మాట్లాడతారు.

పోలీసులు ప్రజలపైన చేసే దాడుల గురించి, కస్టడీలో పెట్టే చిత్రహింసల గురించి, ఉద్యమాలపైన ప్రయోగించే లాఠీల గురించి, బూటకపు ఎన్‌కౌంటర్ల గురించి మనం చాలా కాలంగా వింటున్నాం, ఆందోళన చేస్తున్నాం.

స్థానిక పోలీసుల బలం సరిపోదని భావించి సైన్యాన్ని రంగంలోకి దింపిన ప్రాంతాలలో – అంటే కాశ్మీర్, పంజాబ్, అస్సాం, నాగాలాండ్, మిజోరం తదితర రాష్ట్రాలలో – సైన్యం, పారామిలిటరీ బలగాలు ఇదే రకమైన దుర్మార్గాలకు పాల్పడుతున్నాయి. వీటి గురించి కూడ వింటున్నాం, ఆందోళన చేస్తున్నాం.

కానీ ఈ మధ్య కాలంలో ప్రభుత్వ సాయుధ బలగాల 'చేతికి మట్టి అంటకుండా' అణచివేతను అమలుపరిచే ఒక కొత్త విధానాన్ని మన పాలకులు కనిపెట్టారు. ఇది పంజాబ్‌లో మొదలై ఈశాన్య భారతానికీ ఆ తరువాత కాశ్మీర్‌కూ పాకింది. ప్రజాగాయకుడు గద్దర్‌పైన హైదరాబాద్‌లో హత్యాప్రయత్నానికి పాల్పడిన 'గ్రీన్ టైగర్స్' ఈ కొత్త విధానం ఆంధ్రప్రదేశ్‌కి కూడ చేరుకున్నట్టు ప్రకటించకనే ప్రకటించారు.

**జాపా లక్ష్మారెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా సదస్సు**

చట్టవిరుద్ధమైన పనులు పోలీసులు చేస్తే కోర్టులు జోక్యం చేసుకోగలవు. రాజ్యాంగాన్ని అమలు చేసే బాధ్యత ప్రభుత్వానికి ఉందనీ ప్రభుత్వ అంగాలైన పోలీసులూ సైనిక బలగాలూ రాజ్యాంగ విలువలకూ హక్కులకూ విరుద్ధంగా నడుచుకోవడానికి వీలులేదనీ ఆదేశాలు జారీ చేయగలవు. పౌరులను రక్షించవలసిన పోలీసులు, దేశాన్ని రక్షించవలసిన సైన్యమూ హత్యలకూ చిత్రహింసలకూ గృహవిధ్వంసానికీ పాల్పడడమేమిటని ప్రజలు ఛీత్కరించుకుంటారు. దేశపాలన దిగజారిపోయిందని విమర్శిస్తారు. ప్రభుత్వానికీ పాలనకూ ప్రజలలో గౌరవం పోతుంది.

కాబట్టి, 'కాగల కార్యం గంధర్వుల చేత జరిపించేస్తే' సమస్య తీరిపోతుంది కదా? తెల్లబట్టల హంతక ముఠాలను ప్రోత్సహించి, వారికి ఆయుధాలు సరఫరా చేసి, పోలీసు క్వార్టర్స్‌లోనూ సైన్యం కంటోన్మెంట్‌లోనూ

వారికి రక్షణ కల్పించి, వాళ్లచేతనే అణచివేత అమలు చేయించేస్తే ఏ గొడవా ఉండదు కదా? అనే దుర్మార్గమైన ఆలోచన మన పాలకులకొచ్చింది.

దీనివల్ల అణచివేత యంత్రాంగానికి ఇంకొక 'ప్రయోజనం' కూడ ఉంది. ఈ పద్ధతి ప్రజలలో భయాన్ని కూడ చాలా పెంచుతుంది. పోలీసులు కూడ తెల్లబట్టలలో సంచరిస్తూ దాడులకూ హత్యలకూ పాల్పడుతున్నారు. ఉత్తర తెలంగాణవాసులు ఈ దృశ్యాన్ని నిత్యం చూస్తున్నారు, అనుభవిస్తున్నారు. అదే చాలా భయం గొలిపే విషయమైతే, పోలీసుల ప్రోత్సాహంతో ప్రైవేట్ వ్యక్తులు ఆయుధాలు పట్టుకొని సమాజంలో సంచరిస్తుంటే అది ఇంకెంత భయోత్పాతం కలిగించాలి?

ఏ రాజకీయ పోరాటాల అణచివేత కోసమైతే ఈ ఎత్తుగడను పాలకులు అనుసరిస్తున్నారో, ఆ పోరాటాలలో పని చేసి బయటికొచ్చి నేరస్తులుగా మారిపోయిన వారిని చేరదీసి వారికి ఆయుధాలిచ్చి ఆ పోరాటాలపైన, వాటి సానుభూతిపరులైన ప్రజలపైన వారిని ప్రయోగిస్తున్నారు. ఈ 'మాజీ'లకు చాలా విషయాలు తెలిసి ఉంటాయి కాబట్టి ఇది సంబంధిత ప్రజలకు మరీ 'భయం' గొలిపే విషయం.

అస్సాంలో 'సల్ఫా', కాశ్మీర్‌లో 'ఇఖ్వాన్-ఉల్-ముస్లిమూన్' ఈ విధంగానే పుట్టాయి. మన రాష్ట్రంలో మెదక్ జిల్లాలో వినయకుమార్ సింగ్ ఎస్.పిగా ఉండగా నేరస్తులుగా మారిన 'మాజీల'తో ఇదే విధంగా 'ప్రజారక్షణ' పేరిట ఒక ప్రైవేట్ ముఠాను తయారుచేశాడు. అది అతని వ్యక్తిగత విపరీత ధోరణి కాదని రుజువు చేస్తూ ఆ తరువాత కాలంలో గ్రీన్‌టైగర్స్, బ్లాక్‌టైగర్స్, క్రాంతిసేనలు పుట్టాయి. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నల్గొండ, మహబూబ్‌నగర్‌లలో దాడులకూ హత్యలకూ బెదిరింపులకూ పాల్పడ్డాయి. ఇవి కేవలం స్పెషల్ పోలీసుల బేనామీలా లేక నిజంగా ప్రైవేట్ గుండాల ముఠాలా అనేది ఇప్పటికీ అస్పష్టంగానే ఉంది.

ఈ ముఠాల వాళ్లు తుపాకులు ధరించి సైన్యం వాహనాలలో పోలీసు జీపులలో తిరగడం, రోడ్డు పక్కన సైనిక జవాన్ల భుజం మీద చేయివేసి ముచ్చట్లు ఆడుకోవడం, కాశ్మీర్‌లో అస్సాంలో ప్రజలు నిత్యం చూసే దృశ్యాలు. ఇవి ప్రజాస్వామ్యాన్నీ చట్టబద్ధపాలననూ అపహాస్యం చేసే దృశ్యాలు. ఇవి ఆంధ్రప్రదేశ్‌లోనూ కనిపించేదాకా ఆగుదామా? లేకపోతే ఇప్పటికే మొలకెత్తిన ఈ దుర్మార్గమైన విధానాన్ని ఆదిలోనే ఎదుర్కొందామా?

| | | |
|---|---|---|
| స్థలం | : | ప్రెస్‌క్లబ్, బషీర్‌బాగ్, హైదరాబాద్ |
| తేదీ | : | 9 నవంబర్, ఆదివారం |
| సమయం | : | సాయంత్రం 6 గంటలు |
| వక్తలు | : | సంజయ్ బోర్బొరా (నార్త్‌ఈస్ట్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ హ్యూమన్ రైట్స్), గౌతం నవలాఖా (కమిటీ ఫర్ ఇనీషియేటివ్ ఆన్ కాశ్మీర్), ప్రొఫెసర్ పర్మిందర్ సింగ్ (అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రైట్స్, పంజాబ్), తదితరులు. |

- ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం

**(A P C L C)**